ఈనాడు
వరంగల్
బుధవారం అక్టోబరు 23, 2024 5

రూ.10 వేలకే ఎకరం భూమికి పోడు పట్టా!

నర్సంపేటలో నయా దందా!

మీకు తెలుసా.. రూ.10 వేలు ముట్టజెప్పితే ఎకరం భూమి హక్కు పత్రం (పట్టా పుస్తకం) ఇస్తారు. మరో రూ.10 వేలు ఇస్తే బ్యాంకులో పంట రుణం ఇప్పిస్తారు. చదవడానికి ఆశ్చర్యంగా అనిపిస్తున్నా ఇది నిజం.

ఎక్కడ అంటారా.. నర్సంపేట నియోజకవర్గంలో.. దళారులు అటవీ భూములకు అటవీ హక్కు పత్రాల(పట్టా పుస్తకాల) పేరుతో నడిపిస్తున్న నయా దందా ఇది. అటవీ, మారుమూల గ్రామాల రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ పోడు పట్టాదారు పుస్తకాలను అంటగట్టి రెండు చేతులా దండుకుంటున్నారు. ఈ నకిలీ పుస్తకాలు చెలామణి బహిరంగంగానే సాగుతున్నా సంబంధిత ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


– నర్సంపేట, న్యూస్‌టుడే

ఎలా జరిగిందంటే..

గతేడాది పోడు భూములు సాగు చేసిన గిరిజన తెగకు చెందిన కోయ, లంబాడ, నాయకపోడు, ఎరుకల సామాజిక వర్గాల వారికి ప్రభుత్వం సర్వే చేసి అటవీ హక్కు పత్రాలు(పట్టాదారు పుస్తకం) జారీ చేసింది. దీనిని అవకాశంగా తీసుకుని సులువుగా డబ్బులు సంపాదించేందుకు నకిలీ అటవీ హక్కు పత్రాల తయారీకి శ్రీకారం చుట్టారు. సదరు దళారీ గ్రామాల్లోకి వెళ్లి తనకు రూ.10 వేలు ఇస్తే ఎకరం భూమి పోడు పట్టా పుస్తకం ఇస్తానని నమ్మబలికాడు. ముందుగా ఒకరిద్దరికి ఇవ్వడంతో నమ్మి వివిధ గ్రామాలకు చెందినవారు మూడు, నాలుగు ఎకరాలకు నగదు ముట్టజెప్పి పుస్తకాలు పొందారు. ఓ అటవీ గ్రామంలో గిరిజనేతరులైన రైతులకు నకిలీ పోడు పట్టాలు ఇవ్వడం కొసమెరుపు. నల్లబెల్లి మండలంలో ఐదు గ్రామాలు, నర్సంపేట మండలంలో మూడు గ్రామాల్లో ఈ నకిలీ పోడు పట్టా పుస్తకాలు జోరుగా చెలామణి అయ్యాయి. గత యాసంగి సీజన్‌లో నర్సంపేటలోని ఓ బ్యాంకు నుంచి వారు పంట రుణాలు పొందడం విశేషం.



నమోదైన భూమి వివరాలు



నకిలీ అటవీ హక్కు పుస్తకంలోని ఓ రైతుకు చెందిన వివరాలు


బ్యాంకర్ల తీరుపైనా అనుమానాలు

సాధారణంగా రైతులు పంట రుణం కోసం బ్యాంకుకు వస్తే పట్టాదారు పాసు పుస్తకం, 1బీ పత్రం, ఏ బ్యాంకులో రుణం లేనట్టు (నో డ్యూ) ధ్రువపత్రం తెప్పించుకుంటారు. సదరు రైతు సమర్పించిన పత్రాలు వాస్తవమా కాదా అని ఆన్‌లైన్‌లో రెవెన్యూ రికార్డులో నిర్ధారించుకుంటారు. అనంతరం నానా కొర్రీలు పెట్టి అరకొరగా రుణం ఇస్తారు. ఈ నకిలీ పోడు పట్టా పుస్తకాలకు అటవీ అధికారుల రికార్డులు పరిశీలించకుండా, నో డ్యూ ధ్రువపత్రం లేకుండానే బ్యాంకు అధికారులు రుణం ఇవ్వడం గమనార్హం. దీంతో బ్యాంకర్ల తీరుపైనా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ పోడు పట్టా పుస్తకాల గుట్టు రట్టు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ విషయమై నర్సంపేట అటవీక్షేత్ర అధికారి రవికుమార్ వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

నేటి నుంచి స్వదేశీ మేళా

గిర్మాజీపేట, మట్టెవాడ: స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో 'స్వదేశీ మేళా' ఈ నెల 23 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు చార్టెడ్ అకౌంటెంట్ జిల్లా బ్రాంచి ఛైర్మన్ భగవాన్ దాస్ ముందాడ తెలిపారు. మేళాకు సంబంధించిన ఆహ్వాన పత్రికను మంగళవారం వరంగల్ తపాలా కార్యాలయం జంక్షన్‌లోని ముందాడ భవన్ వద్ద ఆవిష్కరించారు.

వృద్ధులకు ఆదరువు కరవు!



ఇటీవల కాలంలో వయోవృద్ధుల సంరక్షణ ప్రశ్నార్థకమవుతోంది. కనిపెంచిన పిల్లలు రెక్కలొచ్చిన తర్వాత.. తల్లిదండ్రులను వదిలి రివ్వున ఎగిరిపోతున్నారు. ఆస్తులన్నీ చేజిక్కించుకున్నాక.. వయసు మళ్లిన కన్నవాళ్లను అనాథలను చేస్తున్నారు. పేద ధనిక తేడాలేకుండా అన్ని వర్గాల్లోనూ వృద్ధులు ఇలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇలా కన్నబిడ్డలు త్యజించిన వృద్ధులు తమకు న్యాయం చేయాలని కోరుతూ.. ప్రజావాణిలో మొరపెట్టుకుంటున్నారు.

–వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఆర్థికంగా స్థిరపడిన వృద్ధులు రూ.వేలకు వేలు చెల్లించి ప్రైవేటు వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతుండగా.. నిరుపేద వృద్ధులు రోడ్డున పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంరక్షణ కేంద్రాలతో పాటు ప్రభుత్వ వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించింది. పక్కనున్న హనుమకొండ జిల్లాలో సంరక్షణ కేంద్రం ఏర్పాటు కోసం ఆ జిల్లా కలెక్టర్ రూ.4.50 లక్షలు కేటాయించారు. జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న ఓ పాత భవనానికి మరమ్మతులు చేసి అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈ నెల ఒకటో తేదీన వృద్ధుల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కాగా వరంగల్ జిల్లాలో ఆ దిశగా ఒక్క అడుగు పడకపోవడం శోచనీయం.

గుర్తింపు కార్డులకు విలువేది..

వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం 60 ఏళ్లు పైబడిన వారికి జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. ఈ కార్డులతో గతంలో ఉచితంగా బస్సు పాసులు, రైళ్లలో వృద్ధులకు రాయితీతో కూడిన ప్రయాణం చేసేందుకు వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం గుర్తింపు కార్డులతో పుణ్యక్షేత్రాల్లో ఉచిత దర్శనం మినహాయించి.. ఎలాంటి సదుపాయాలు అమలు కావడం లేదని వృద్ధులు వాపోతున్నారు. పైగా గుర్తింపు కార్డుల జారీ చేసేందుకు కొందరు అధికారులు వృద్ధుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.


జిల్లా పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన హనుమకొండ జిల్లా వృద్ధుల సంరక్షణ కేంద్రం

సంరక్షణ కేంద్రాల్లో ఏముంటాయంటే!

వృద్ధుల సంరక్షణ కోసం 'డే కేర్' కేంద్రాల్లో వైద్య సాయం, ఫిజియోథెరపీ వంటి సదుపాయాలు కల్పిస్తారు. అందుకోసం ప్రత్యేకంగా ఓ వైద్య సిబ్బందిని నియమిస్తారు. ఆహ్లాదం కోసం చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్, ఆరోగ్యం కోసం యోగా, జిమ్ వంటి సదుపాయాలుంటాయి. దినపత్రికలతో పాటు వివిధ రకాలైన సామాజిక, ఆరోగ్య, ఆధ్యాత్మిక పుస్తకాలు, టెలివిజన్, విశ్రాంతి కోసం బెడ్లు అందుబాటులో ఉంటాయి. 60 ఏళ్లు పైబడిన వారందరూ కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు కబుర్లు చెప్పుకొనేందుకు, కాలక్షేపం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఈ కేంద్రాల్లో అధికారులు సమకూర్చాల్సి ఉంటుంది.

రెండేళ్లుగా.. అధికారులను కోరుతున్నాం..

- మల్లారెడ్డి, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

జిల్లాలో 'డే కేర్' కేంద్రాలు ఏర్పాటు చేయాలని రెండేళ్లుగా.. జిల్లా అధికారులను కోరుతున్నాం. అయినా ఎలాంటి ఫలితం లేదు. వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం గురించి మండలాలు, పట్టణాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ సమన్వయ సమావేశాలు తప్పనిసరిగా ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాలి. వృద్ధుల భద్రత కోసం స్థానిక పోలీస్‌స్టేషన్ల నుంచి భద్రతా కార్డులు జారీ చేయాలి.

ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

- రాజమణి, జిల్లా సంక్షేమశాఖ అధికారి

వయోవృద్ధుల సంక్షేమం కోసం సంరక్షణ కేంద్రాలు, ఉచిత వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వివిధ జిల్లాల్లో అక్కడ పనిచేసే కొన్ని సేవా సంస్థలు సంరక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. వరంగల్ జిల్లాలోనూ.. వినియోగంలో లేని ప్రభుత్వ భవనాలను గుర్తించి సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

కొత్త నిబంధనతో ఇక్కట్లు!


రోడ్డుపై ఆందోళన చేస్తున్న పోలీసుల కుటుంబ సభ్యులు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్ పోలీసు కుటుంబాలు తమ డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కారు. రికార్డెడ్ పర్మిషన్ల నాలుగురోజుల సెలవును మార్పు చేయడంతో పనిఒత్తిడి పెరుగుతుందని వాపోయారు. దీనివల్ల ఏడాదికాలంలో ఒకనెల మాత్రమే కుటుంబ సభ్యులతో గడిపే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త నిబంధనతో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఇతర బెటాలియన్లలో పోలీసు కుటుంబాలు ఆందోళన చేపట్టడంతో.. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంగళవారం ఉదయం నుంచి బెటాలియన్ పరిసర ప్రాంతాలు, కూడళ్లలో ప్రత్యేక పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. టీజీఎస్పీ కానిస్టేబుళ్లు, సిబ్బందిని నిర్బంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా కుటుంబ సభ్యులు తప్పించుకొని వచ్చి.. రంగశాయిపేట గవిచర్ల క్రాస్‌రోడ్‌లో ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. సివిల్, ఏఆర్ డిపార్ట్‌మెంట్ల మాదిరిగా టీజీఎస్పీ వారు సైతం ఒకే దగ్గర అయిదేళ్లు పనిచేసేలా చూడాలన్నారు. రోడ్డుపై బైఠాయించిన మహిళలకు కమాండెంట్ రామ్‌ప్రకాశ్, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, సీఐలు రమేశ్, వెంకటరత్నం వారికి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. లిఖిత పూర్వక వినతిపత్రం ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. వాహనాల్లో బెటాలియన్‌కు తరలించిన కుటుంబ సభ్యులకు కమాండెంట్ రామ్‌ప్రకాశ్ మరోసారి కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ఆరోగ్యకర జీవనశైలి అలవర్చుకోవాలి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన జీవనశైలిలో భాగంగా గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడంతో పాటు యోగా, ధ్యానాన్ని అలవర్చుకునేలా అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. మంగళవారం వరంగల్ కాకతీయ వైద్య కళాశాల సమావేశ మందిరంలో ఆర్య జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలకు కల్పించాల్సిన అవగాహన కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి జయంతి, ఆర్యజనని అధ్యక్షుడు అనుపమరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే ఓసీలు


ఎల్బీనగర్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నిబంధనలు పాటిస్తేనే అపార్టుమెంట్లు, వాణిజ్య భవనాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్లు(ఓసీ) జారీ చేస్తామని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ తెలిపారు. అక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను మంగళవారం టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. మడికొండ, హనుమకొండ ఎక్సైజ్‌కాలనీ, వడ్డేపల్లి, వరంగల్ ఎల్బీనగర్, దేశాయిపేటలో నిర్మించిన బడా భవనాలు చూశారు. బల్దియా నుంచి అనుమతి పొందిన ప్రకారం భవనాలు నిర్మించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఓసీలు ఇచ్చేది లేదన్నారు. కొన్ని కాలనీల్లో పారిశుద్ధ్య పనులు తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజిరెడ్డి, ఏసీపీ ఇస్రాత్ తదితరులున్నారు.

ఆచార్యా.. మీకిది తగునా..!

'ఐ సెట్' నిర్వహణ నిధులు పక్కదారి

విద్యానగర్, న్యూస్‌టుడే: ఆయన కాకతీయ యూనివర్సిటీలో ఉన్నత స్థానాల్లో ఉన్న ఆచార్యుల్లో ఒకరు. ఏకంగా ఐసెట్ నిర్వహణ నిధులపై కన్నేశాడు.. 'లెక్క' తేలని కారణాలు చెబుతూ పెద్ద మొత్తంలో దారి మళ్లించాడు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఐసెట్ ఒకటి. దాని నిర్వహణ బాధ్యతలను కాకతీయ యూనివర్సిటీకి అప్పగించారు. దీని నిర్వహణ కోసం ఉన్నత విద్యామండలి కేటాయించిన నిధులను ఈ ఆచార్యుడు దారి మళ్లించినట్లు సమాచారం. 2024 -25 విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి పత్రికా ప్రకటన, సీఈటీ సమావేశానికి, కాన్ఫిడెన్షియల్ పనులు, వేతనాలు, అతిథ్యం, రవాణా, సామగ్రి ఖర్చు, స్టేషనరీ తదితర వాటికి రూ.99.50 లక్షలు అవసరం అవుతాయని ఐసెట్ కన్వీనర్ ఉన్నత విద్యామండలికి ప్రతిపాదన పంపిస్తే రూ.92.76 లక్షలను కేటాయించింది. వాటిలో కొన్నింటికి తక్కువ ఖర్చు అయినా ఎక్కువ అయినట్లు లెక్కలు చూపించి రూ.29.25 లక్షలను ఆ ఆచార్యుడు తన వ్యక్తిగత ఖాతాలో జమ చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం ఉన్నత విద్యా మండలి దృష్టికి వెళ్లింది.



బదిలీ ఇలా

ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.6 లక్షలు, మార్చిలో రూ.5 లక్షలు, ఏప్రిల్‌లో రూ.7 లక్షలు, మే నెలలో రూ.8 లక్షలు, ఆగస్టులో రూ.3.25 లక్షల చొప్పున మొత్తం రూ.29.25 లక్షల అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. ఆరు నెలల్లో రూ.16 లక్షలను సెల్ఫ్ చెక్‌లతో విడుదల చేసుకున్నట్లు సమాచారం. వాటిని ఐసెట్ కాన్ఫిడెన్షియల్ విభాగం ఖర్చు కోసం వాడాలి. వాటిని వినియోగించిన తీరు ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. రవాణా ఖర్చులు నిమిత్తం నెలకు రూ.40 వేలు తీసుకున్నారు. ఐసెట్ పరీక్ష నిర్వహణలో సంబంధం లేని ఒక పెద్దసారుకు వేతనం పేరుతో రూ.2 లక్షలు చెల్లించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐసెట్ కార్యాలయంలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి ఖాతాలోకి ముందు నగదు జమచేసి ఆ తర్వాత విడుదల చేసుకున్నట్లు సమాచారం. విశ్వవిద్యాలయానికి ఎలాంటి సంబంధం లేని మహిళ పేరున రూ.82,600 తీసుకోవడం పట్ల నగదు అక్రమ బదిలీ జరిగినట్లు ఆరోపణలు. కంప్యూటర్ల కొనుగోలులో అవకతవకలకు పాల్పడ్డారు. ఒక్కో కంప్యూటరును రూ.87,849 చొప్పున ఆరింటిని వేర్వేరు దుకాణాల్లో కొనుగోలు చేసినట్లు చూపించారు. ఏవిధమైన కొటేషన్లు, కమిటీ అనుమతి లేకుండానే కొనుగోలు చేయడం గమనార్హం.

మందులిచ్చే వారు లేక ఆందోళన


ఎంజీఎం అత్యవసర మందుల విభాగం వద్ద..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఎంజీఎం ఆసుపత్రిలోని అత్యవసర విభాగం వద్ద ఉన్న మందుల విభాగంలో ఔషధాలు ఇచ్చేవారు లేక రోగులు ఇబ్బందిపడ్డారు. ఆసుపత్రిలో ఓ ఏజెన్సీ ద్వారా ఫార్మసీ విభాగంలో ఎనిమిదేళ్లుగా ఆరుగురు ఫార్మాసిస్టులు పనిచేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ నియామకాలకు వారు దరఖాస్తు చేసుకున్నవారు. ప్రభుత్వ సంస్థలో పనిచేసిన అనుభవం ఉంటే కొన్ని మార్కులు కలుపుతామని నోటిఫికేషన్‌లో పేర్కొనడంతో వారంతా అనుభవ(ఎక్స్‌పీరియన్స్) ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను కలిసి అడిగారు. మీరు పనిచేస్తున్న ఏజెన్సీ ధ్రువీకరిస్తే ఇస్తామని ఆయన సమాధానం చెప్పారు. ఏజెన్సీ వారిని అడిగితే అంగీకరించలేదు. దీంతో వారంతా మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్‌ను కలవడానికి వెళ్లారు. కలెక్టర్ కలవకపోవడంతో నిరాశతో ఇళ్లకు వెళ్లిపోయారు. వారి స్థానంలో వేరొకరిని విధుల్లో ఉండేలా చూడాల్సిన సూపర్‌వైజర్ పట్టించుకోలేదు. దీంతో ఎంజీఎం అత్యవసర విభాగంలో సాయంత్రం వేళ మందులిచ్చేవారు లేక రోగులు ఆందోళనకు దిగారు. విషయం సూపరింటెండెంట్ సీహెచ్ మురళి దృష్టికి వెళ్లడంతో పొరుగు సేవల ఫార్మాసిస్టును మందుల విభాగానికి పంపించారు. మందులిచ్చేలా చర్యలు తీసుకోవడంతో రోగులు శాంతించారు.



కోటలో యువ టూరిజం క్లబ్ సభ్యులు

చారిత్రక కాకతీయ కట్టడాలున్న ఖిలా వరంగల్ కోటలో 'యువ టూరిజం క్లబ్' సభ్యులు మంగళవారం సందడి చేశారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, తెలంగాణ పర్యాటక శాఖ నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంపు-2024 శిక్షణలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి 80 మంది విద్యార్థులు తరలివచ్చారు. మధ్యకోట కళాతోరణాల నడుమ శిల్పాలు, ఖుష్‌మహల్, స్వయంభు దేవాలయం, ఏకశిలా గుట్ట, రాతి, మట్టికోటలను తిలకించారు. సాయంత్రం సౌండ్స్, లైటింగ్ షో ప్రదర్శన తిలకించారు. మొదట వేయిస్తంభాల, భద్రకాళి దేవాలయాలను సందర్శించారు. వీరికి అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డా.కుసుమ సూర్యకిరణ్ చరిత్రను వివరించారు. – న్యూస్‌టుడే, ఖిలావరంగల్

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులకు కంట్రోల్ రూం

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించి రైతులు మోసపోకుండా.. రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈసారి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్నరకం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో ఇప్పటికే రాయపర్తి, సంగెం మండలాల్లో సుమారు 10 కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. వరి కోతల ఆధారంగా మరిన్ని కేంద్రాలు ప్రారంభించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి తెలిపారు. ఖరీఫ్(వానాకాలం) సీజన్‌లో జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు, రైతుల సమస్యలు పరిష్కరించేలా కంట్రోల్ రూం ఏర్పాటు, సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరు కేంద్రాలు, తదితర అంశాలపై మంగళవారం 'న్యూస్‌టుడే' నిర్వహించిన ముఖాముఖిలో ఆమె వివరాలు వెల్లడించారు.



ముఖాముఖి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి

? **న్యూస్‌టుడే:** జిల్లా పరిధిలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు? ఎంతమేర ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు?

✔ **అదనపు కలెక్టర్:** జిల్లావ్యాప్తంగా ఐకేపీ 51, పీఏసీఎస్ 133, మెప్మా 1, ఇతరులు 18 మొత్తం 203 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటివరకు రాయపర్తి, గీసుకొండ మండలాల్లో 10 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. అయితే ధాన్యంలో తేమశాతం ఎక్కువగా వస్తుందన్నందుకు ఇంకా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభించలేదు. జిల్లాలో సుమారు 10-15 రోజుల్లో వరికోతలు మొదలయ్యే అవకాశముంది. మొత్తం 24లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అంచనా వేశాం.

? అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు?

✔ ప్రతీ కొనుగోలు కేంద్రంలో అవసరాన్ని బట్టి 20 నుంచి 30 టార్పాలిన్లు అందుబాటు ఉంచుతున్నాం. మొత్తం 6,090 టార్పాలిన్లు అవసరం ఉండగా.. ప్రస్తుతం 3,174 ఉన్నాయి. మార్కెటింగ్‌శాఖ టెండర్ల ద్వారా వారంలోగా అవసరమైన సంఖ్యలో టార్పాలిన్లు కేంద్రాలకు పంపిస్తారు. ప్యాడీక్లీనర్లు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలను పూర్తిస్థాయిలో కొనుగోలు సమయానికి కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతాం. కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఎలాంటి సమస్యలున్నా కంట్రోల్ రూంకు సమాచార అందించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

? ధాన్యం రవాణా, గన్నీ సంచుల కొరత తదితర సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

✔ జిల్లాను 5 డివిజన్లుగా విభజించి టెండర్లు పూర్తిచేసి అనుమతి కోసం కమిషనరేట్‌కు నివేదికలు పంపించాం. ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో ప్రారంభయ్యే సమయానికి అనుమతులు వచ్చే అవకాశముంది. ఈసారి ధాన్యం కొనుగోళ్ల కోసం మొత్తం 60 లక్షల గన్నీలు అవసరం ఉండగా.. ప్రస్తుతం 22,45,242 అందుబాటులో ఉన్నాయి. కమిషనరేట్ పరిధిలో టెండర్లు పూర్తయ్యాయి. అందుబాటులో ఉన్న గన్నీలతో పాటు మిల్లర్ల వద్ద ఉన్న సుమారు 5లక్షల ఒకసారి వినియోగించిన గన్నీలను కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం.

? గతంలో బకాయిలున్న మిల్లులకు ధాన్యాన్ని కేటాయిస్తారా?

✔ గత యాసంగి సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ గడువు ఇంకా ఉంది. అయితే ఖరీఫ్ సీజన్ వరకు సీఎంఆర్ పూర్తిచేయని మిల్లులకు ఈసారి ధాన్యం కేటాయింపులు చేసే ప్రసక్తి లేదు.

? ధాన్యం డబ్బులు ఎన్ని రోజుల్లో రైతుల ఖాతాల్లో జమవుతాయి? సన్న రకాలకు బోనస్ ఏ విధంగా చెల్లించనున్నారు?

✔ గత సీజన్‌లో రైతులు పంట విక్రయించిన 5 నుంచి 7 రోజుల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశాం. ఈసారి చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా గత సీజన్ మాదిరి బోనస్ డబ్బులూ చెల్లిస్తాం. కొనుగోళ్లు పూర్తయి ఆన్‌లైన్‌లో నమోదై.. ట్రక్‌షీట్ జనరేట్ అయిన 4-5 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి. ప్రభుత్వం బోనస్ ఎంత చెల్లించిందో రైతుల చరవాణికి సంక్షిప్త సందేశం అందుతుంది. కౌలురైతులు, పాసుపుస్తకాలు, ఆధార్ సంఖ్య తదితర సమస్యల కారణంగా.. చెల్లింపుల్లో ఆలస్యమైతే.. మండల వ్యవసాయ అధికారి ధ్రువీకరించిన పత్రాన్ని సమర్పించాలి. ఆన్‌లైన్ నమోదులో సమస్యలు తలెత్తకుండా ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్నాం.

? సన్నరకాలను నిర్ధారించేందుకు ఎలాంటి విధానాలను అనుసరిస్తారు?

✔ 33 రకాలను సన్నరకాలుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. జిల్లా పరిధిలో మాత్రం సుమారు 10- 12 రకాల సన్నరకం ధాన్యం మాత్రమే రైతులు సాగుచేస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కేంద్రాల్లో సన్నరకం ధాన్యం నిర్ధారణకు గ్రేన్ క్యాలిపర్స్ యంత్రాలను అందుబాటులో ఉంచాం. అంతకు ముందే వ్యవసాయశాఖ అధికారులు ధాన్యాన్ని పరిశీలించి రైతులకు ఇచ్చే టోకెన్‌పై ఏ రకమో రాసి ఇస్తారు. తద్వారా కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు.

మూడు వైపులా.. కష్టాలే!

నిత్యం వేలాది ప్రైవేటు వాహనాలు, కార్ల రాకపోకలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు ఇవన్నీ హనుమకొండ బస్టాండు ప్రాంతంలో కనిపించే ట్రాఫిక్ కష్టాలు. నగరవాసులు ఆ మార్గంలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉమ్మడి వరంగల్‌కు కీలకమైన హనుమకొండ ప్రధాన బస్టాండులో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రత్యామ్నాయ మార్గాలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

● పద్మవ్యూహంలో హనుమకొండ బస్టాండ్
● ఛేదించడానికి ఉన్నాయి మార్గాలు

పరిశీలన

ఎవరికి నచ్చినట్టు వారు..



ఆటోలు, ఫుట్‌పాత్‌లపై వాహనాలు

బస్టాండు లోపలికి వెళ్లే రెండు దారులు గందరగోళంగా ఉంటాయి. ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుంటారు. కొందరు ఆటో డ్రైవర్లు బస్టాండు నుంచి వచ్చే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అక్కడే చక్కర్లు కొడుతూ ట్రాఫిక్ సమస్యలు తెస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లకు వచ్చే వారి వాహనాలతో రోడ్డు మొత్తం బ్లాక్ అవుతోంది.

కట్టడి చేయడం కీలకం

☛ ఆటోవాలాలు క్రమ పద్ధతిలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చూడాలి. ☛ బస్టాండు రోడ్డుకు రెండు వైపులా ప్రైవేటు ఆసుపత్రుల వారు ఆక్రమించుకున్న ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించాలి. పాదచారులు నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.



1 ఇది కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి.. బస్టాండ్‌లోని బస్సులన్నీ దీని ద్వారానే బయటకు వెళ్లాలి





2 ఇది కీలకమైన జంక్షన్ దారి.. దీన్ని మూసివేయడంలో ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది.

మూడు మార్గాలు ఉన్నా..

బస్టాండు లోకి వెళ్లడానికి మూడు దారులున్నాయి. కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి, బస్టాండు జంక్షన్ పక్కన ఒకటి, మసీదు పక్కన మరొకటి. అన్ని మార్గాల గుండా వచ్చే బస్సులు మసీదు పక్కన ఉన్న గేటు నుంచే బస్టాండ్‌లోనికి అనుమతి ఇస్తున్నారు. వందలాది బస్సులు ఇదే మార్గంలో లోపలికి రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరోవైపు బస్సులన్నీ కేడీసీ దారిలో ఉన్న గేటు గుండా బయటకు వెళ్తుంటాయి.. కీలకమైన బస్టాండ్ జంక్షన్ దారిని ప్రమాదాలు జరుగుతున్నాయని మూసివేశారు.

ఇలా చేద్దాం

☛ గతంలో మాదిరిగానే బస్సులు లోపలికి వచ్చే మార్గాలు రెండు ఉండాలి.

☛ ఏటూరునాగారం, ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, నర్సంపేట రూట్లలో వచ్చే బస్సులు హనుమకొండ చౌరస్తా మీదుగా మసీదు పక్క ఉన్న దారి గుండా లోపలికి వెళ్లాలి.

☛ హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జనగామ నుంచి వచ్చే బస్సులు జంక్షన్ వద్ద ఉన్న మార్గం ద్వారా లోపలికి వెళ్లే ఏర్పాటు చేయాలి.

☛ ప్రమాదాలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో పాటు ఇద్దరు ట్రాఫిక్ పోలీసులను ఉంచాలి. ప్రైవేటు వాహనాలు లోపలికి రాకుండా కట్టడి చేయగలిగితే ప్రమాదాలు జరగవు.

సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి

– నాల్లగిరి రమేష్, ప్రయాణికుడు, హనుమకొండ



బస్టాండు రోడ్డు నుంచి మచిలీబజార్, పద్మాక్షి రోడ్డుకు వెళ్లాలంటే కనీసం అరగంట సమయం పడుతోంది. ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇష్టారీతిగా పార్కింగ్ చేసి ఉంటాయి. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నడుపుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులతో పాటు, నగరపాలక సంస్థ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

ప్రైవేటు వాహనాలను అడ్డుకుంటున్నాం..

– విజయభాను, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్



బస్టాండులోకి ప్రైవేటు వాహనాల రాకను పూర్తిగా అడ్డుకట్ట వేశాం. కాజీపేట, ములుగు రోడ్డు, పెట్రోల్‌పంపుల నుంచి కొన్ని బస్సులను నేరుగా పంపించేందుకు అక్కడ అనువైన స్థలం లేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తున్నాం.



3 ఇది మసీదు పక్క నుంచి బస్టాండ్‌లోకి వెళ్లే దారి.. బస్సులన్నీ ఇక్కడి నుంచే లోపలికి వెళ్లాలి..

వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ డిపోలు	9
మొత్తం బస్సులు	908
నిత్యం హనుమకొండ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల సంఖ్య	60 వేలు
ఉమ్మడి ఆరు జిల్లాల నుంచి వచ్చే బస్సులు	1200
ప్రయాణించే మార్గాలు	374



ములుగు రోడ్డు బస్టాండు

ఇదీ పరిస్థితి

హనుమకొండ బస్టాండు ఇరుకుగా ఉంటుంది. పక్కపక్కనే ప్లాట్‌ఫారాలు ఉండటంతో బస్సులు లోపలికి వచ్చి బయటకు వెళ్లాలంటే గంటల కొద్ది సమయం వృథా అవుతోంది. ప్రయాణికులూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

పరిష్కారం

☛ హైదరాబాద్ తరహాలో బస్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ నగరంలో ఎంజీబీఎస్ ప్రధాన బస్ స్టేషన్ ఉన్నప్పటికీ కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు ఎక్కువ సంఖ్యలో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి నడుస్తాయి. వరంగల్ వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి నడుస్తాయి. అదే తరహాలో ఇక్కడ కరీంనగర్, ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక బస్‌స్టేషన్ నుంచి పంపిస్తే ఇబ్బందులు తీరుతాయి.

☛ హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో 20 శాతం బస్సులను హనుమకొండ బస్టాండు నుంచి కాకుండా కాజీపేట బస్టాండు నుంచి పంపిస్తే సగం ప్రయాణికులకు సమయం ఆదాతో పాటు ఆర్టీసీకి డీజిల్ ఆదా అవుతుంది. ట్రాఫిక్ సమస్యలు ఉండవు.

☛ ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్ వెళ్లే వాహనాలు నేరుగా ములుగు రోడ్డు నుంచి వెళ్లేలా చూడాలి.

☛ కరీంనగర్, నిజామాబాద్ బస్సుల్లో కొన్నింటిని హనుమకొండ పెట్రోల్ పంపు నుంచి నేరుగా పంపించొచ్చు.

☛ రిజర్వేషన్ బస్సులను సైతం మరో చోటు నుంచి పంపించే ఏర్పాటు చేస్తే సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుంది.



కాజీపేట బస్టాండు



విలేకరుల సమావేశంలో కథానాయిక అనన్య, హీరో యువ చంద్రకృష్ణ

'పొట్టేల్' సినిమా బృందం సందడి


కాశీబుగ్గ, న్యూస్‌టుడే: నగరంలో 'పొట్టేల్' సినిమా బృందం సందడి చేసింది. ఆకట్టుకునే కథ, మెప్పించే కథనంతో ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'పొట్టేల్' సినిమాను ఆదరించాలని కథానాయకుడు యువ చంద్రకృష్ణ, కథానాయిక అనన్య ప్రేక్షకులను కోరారు. మంగళవారం వరంగల్ వెంకట్రామా థియేటర్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వరంగల్‌కు చెందిన నిషాంత్ రెడ్డి, సురేశ్ చిత్రాన్ని నిర్మించారని, పక్కా పల్లె వాతావరణం, చిన్నపాప చదువు కోసం మేం పడిన కష్టం ఈ సినిమాలో కనిపిస్తుందని చిత్ర బృందం తెలిపింది. గురువారం సినిమా విడుదలవుతోందని, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారం చేశామని, తెలంగాణలో వరంగల్ నుంచే మొదలు పెడుతున్నామని వివరించారు. ఓటీటీలో కాకుండా సినిమాను థియేటర్ లోనే చూడాలని అభ్యర్థించారు. అంతకు ముందు హీరో యువ చంద్రకృష్ణ తీన్మార్ డాన్స్ చేశారు. సమావేశం అనంతరం సినిమా పోస్టర్లను ఆవిష్కరించారు. కథానాయిక అనన్యతో స్వీయచిత్రం దిగడానికి అభిమానులు పోటీపడ్డారు.

అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 25న నిర్వహించాల్సిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా వేస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి సంస్థ అధికారి, అండర్-19 ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఇతర క్రీడాంశాలు షెడ్యూల్ ప్రకారమే ఉంటాయన్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)	
ఫాంరేటు: 125	డ్రెస్డ్: 213
రిటైల్: 147	స్కిన్‌లెస్: 243

ప్రధాని మోదీ ప్రత్యుత్తరం.. మురిసిన విద్యార్థులు



గుండెంగ యూపీయస్ విద్యార్థులకు ప్రధాని రాసిన ప్రత్యుత్తరం

దేవరుప్పుల (జనగామ జిల్లా), మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7వ తరగతుల విద్యార్థులు వారంతా.. పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కొడిపాక రమేశ్ ప్రోత్సాహంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ హిందీలో లేఖలు రాసి పోస్టు చేశారు. సోమవారం ప్రధాని కార్యాలయం నుంచి 'ధన్యవాదాలు' అంటూ ప్రత్యుత్తరం అందింది. దీంతో ఆ పల్లె వాసులు, విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కిషన్, చీకటి శ్రీను, కందిక దామోదర్, ప్రధానోపాధ్యాయుడు రాజు సమక్షంలో వాటిని విద్యార్థులకు అందించడటంతో పండగ వాతావరణం నెలకొంది.



ప్రధాని రాసిన లేఖలతో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



భద్రపరుచుకుంటాం..

- మణిహర్షిత, ఏడో తరగతి

గత నెలలో పోస్టుకార్డుతో ప్రధాని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మాస్టారు లేఖ రాయమంటే రాసి మరిచిపోయాం. ప్రస్తుతం తిరిగి లేఖ రావడంతో విద్యార్థులం అంతా చాలా ఆనందపడ్డాం. ఆంగ్లంలో వచ్చిన లేఖను ఉపాధ్యాయులు చదివి తెలుగులో వివరించారు. దేశ ప్రధాని నుంచి వచ్చిన ప్రత్యుత్తరం ఫ్రేమ్ కట్టించి ఇంట్లో భద్రపరుచుకుంటాం.

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపు.. దుండగుడి అరెస్టు

దామెర, న్యూస్‌టుడే: డబ్బు కోసం డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన దుండగుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ జిల్లా పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ తెలిపారు. దామెర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి, 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తదనంతరం ఎన్ని పనులు చేసినా ఎక్కువ డబ్బు రాకపోవడంతో ఖమ్మం శివారులో పలు కిరాణా దుకాణాలకు వెళ్లి మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. డమ్మీ పిస్టల్‌తో బెదిరిస్తే మరింత డబ్బు వసూలు చేయవచ్చని భావించి హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొనుగోలు చేశాడు. దీంతో అతనిపై ఖమ్మం జిల్లా పరిధిలో సుమారుగా 10కి పైగా కేసులు నమోదయ్యాయి. రూ.800తో మరో నకిలీ తుపాకీ కొనుగోలు చేశాడు. వరంగల్‌లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈ నెల 21న ఖమ్మం నుంచి రైలులో వరంగల్‌కు చేరుకుని అర్ధరాత్రి వేళ ఊరుగొండ వద్ద ఆటో దిగాడు. అక్కడ కిరాణం దుకాణం యజమాని కందికొండ సంపత్‌ను నిద్రలేపి సిగరెట్ తీసుకుంటున్న క్రమంలో డమ్మీ పిస్టల్ చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. లేవని చెప్పిన సంపత్‌ను కిందపడేసి గల్లా పెట్టెలో రూ.2000 తీసుకొని, తాను నక్సలైట్‌నని, ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈక్రమంలో సంపత్ దుండగుడు వెంకటేశ్వర్లును గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. వెంటనే చేరుకున్న స్థానికులు అతణ్ని బంధించి డమ్మీ పిస్టల్‌ను లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దుండగుడు వెంకటేశ్వర్లు వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరి వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్, ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్

సీతాఫలాల విక్రయాలు.. రాకపోకలకు తిప్పలు!



జనగామ పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డు వైపు యూటర్న్ వద్ద బైపాస్ రహదారిపైనే సీతాఫలాల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు సీతాఫలాల కొనుగోళ్లకు ఆగడంతో కొంత మేర రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారి పక్కగా కూర్చుంటే ఇబ్బందిగా ఉండదని విక్రయదారులుకు పోలీసులు సూచిస్తున్నారు.

– న్యూస్‌టుడే, జనగామ టౌన్


వరిసాగు అందం.. తేయాకు తోటల చందం



ఈ చిత్రం చూస్తుంటే అస్సాం రాష్ట్రంలోని తేయాకు తోటలను తలపిస్తున్నాయి కదూ. ఇది వరి విత్తనోత్పత్తి క్షేత్రం. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ శివారులో కావేరి విత్తన సంస్థ ఆధ్వర్యంలో రైతు ఆడ, మగ వరిని నాటారు. మగ వరి కోసి వేరు చేయడంతో మిగిలిన పంట తేయాకు తోటలో పాదుల్లాగ ఇలా కనిపిస్తోంది. దారిన పోయే బాటసారులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే భీమదేవరపల్లి

హరిత గిరి.. కొలువైన శ్రీహరి



పచ్చదనంతో అలరారుతూ ఆహ్లాదకరంగా ఉన్న ఈ కొండ హనుమకొండ జిల్లా భీమారం పరిధిలోని ఎర్రగట్టు గుట్ట. దీనిపై అనేక రకాల ఔషధ మొక్కలు, మధుమేహాన్ని నియంత్రించే తిప్పతీగ, చర్మ వ్యాధులను నయం చేసేందుకు వాడే గడ్డిపూల జాతి మొక్కలు ఉన్నాయి. వీటితో నల్లనేరేడు, సీతాఫలాలు, వేప తదితర వృక్షాలు ఉన్నాయి. ఈ గుట్టపైనున్న ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీహరి భక్తులకు కనులవిందుగా దర్శనమిస్తున్నారు.

– ఈనాడు హనుమకొండ, న్యూస్‌టుడే భీమారం

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం



పోటీపడుతున్న క్రీడాకారులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ చదరంగం సంఘం సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు మంగళవారం హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో ప్రారంభమయ్యాయి. వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 100 మంది బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ. శ్రీనివాస్‌రావు హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు క్రీడాకారుడు, గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ స్ఫూర్తితో రాణించాలని సూచించారు. అనంతరం బాలలతో చదరంగం ఆడి ఉత్తేజపరిచారు. పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా, ఆర్బిటర్స్ సాయిప్రదీప్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.



పార్కు ముఖద్వారం



నెలకొన్న పచ్చదనం



ఓపెన్‌జిమ్‌లో కసరత్తు

ఆహ్లాదకరం యతిరాజారావు పార్కు

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో ఏకైక రెవెన్యూ డివిజన్ కేంద్రం తొర్రూరు. సుమారు 30 వేల పైచిలుకు జనాభా కలిగిన పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి రోజు సుమారు 2-3 వేల వరకు రాకపోకలు సాగిస్తుంటారు. దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరులో ప్రజల సౌకర్యార్థం దివంగత నేత నెమురుగొమ్ముల యతిరాజారావు స్మారకంగా ఆయన పేరున ఏడెకరాల స్థలంలో పార్కును ఏర్పాటు చేశారు. మూడేళ్ల కింద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ.2 కోట్లు కేటాయించి, అందులో ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, సేద తీరడానికి ప్రత్యేక బల్లలు, హట్స్, చూడముచ్చటైన విగ్రహాలు, ప్రత్యేకంగా వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఆటవిడుపుగా నిలుస్తోంది. చుట్టూ వాకింగ్‌ట్రాక్, నర్సరీ నుంచి మొక్కలను తెప్పించి నాటడంతో పచ్చందాలను సంతరించుకుంటుంది. అలాగే ఇక్కడ విజయదశమి నాడు రావణవధ కూడా ఘనంగా నిర్వహిస్తారు. క్రీడా పోటీలు, పలు చిత్రాల షూటింగ్‌లు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. నిత్యం 50 నుంచి 100 పిల్లలు కరాటే శిక్షణ పొందుతారు. ఇక సెలవు రోజుల్లో అయితే జనాల రాకతో కిక్కిరిసి కనిపిస్తుంది.

పర్సంటేజీల పేచీ..!

కార్పొరేషన్, న్యూస్‌టుడే: బల్దియాలో అభివృద్ధి పనుల టెండర్లపై రాజకీయ జోక్యం ఎక్కువైంది. పనుల కేటాయింపునకు ముందే పర్సంటేజీల పనులు చేయడం వివాదాస్పదమవుతోంది. ఒకవైపు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు చేసేందుకు సివిల్ గుత్తేదారులు ససేమిరా అంటున్నారు. కొంతమంది ధైర్యం చేసి టెండర్లు వేస్తే నిర్ణీత సమయంలో తెరవడం లేదు. పర్సంటేజీల పేచీతో వరంగల్ తూర్పు, పరకాల, వర్ధన్నపేట డివిజన్లకు సంబంధించిన టెండర్లు పెండింగ్‌లో ఉన్నాయి. నెలరోజులవుతున్నా ఇంజినీరింగ్ అధికారులు ఆర్థికపరమైన బిడ్లు ఓపెన్ చేయడం లేదని తెలిసింది. సుమారు రూ.6 కోట్ల సాధారణ నిధుల(జనరల్‌ఫండ్) కోసం కార్పొరేటర్లు ఎదురుచూస్తున్నారు. ప్రజాప్రతినిధుల పేరుతో కొందరు గుత్తేదారులు కొన్ని పనులకు ముందస్తుగానే పనులు చేశారు. కొందరు డబ్బులు ఇవ్వకపోవడంతో మొత్తం టెండర్లు ఆపేశారు.

డివిజన్‌కు రూ.30 లక్షలు

● వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల పరిధిలోని 25 డివిజన్లకు గ్రేటర్ వరంగల్ సాధారణ నిధుల ద్వారా రూ.30 లక్షలు కేటాయించారు. కాంగ్రెస్ కార్పొరేటర్లకు మాత్రమే నిధులు కేటాయించారు. కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం పరిధిలో (డ్రాయింగ్ బ్రాంచ్(డీబీ) ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచారు. సుమారు రూ.6 కోట్ల నిధులతో 250-300 పనులు ప్రతిపాదించారు.

● టెండర్లకు ముందే కొందరు గుత్తేదారులు అభివృద్ధి పనుల కోసం ఒక్కటయ్యారు. నాలుగుశాతం పర్సంటేజీ ఇవ్వాలని కోరారు. దానికి కొందరు విరుద్ధంగా పోటాపోటీగా టెండర్లు వేశారు. ఈ నెల మొదటి వారంలో అంతర్జాలంలో సాంకేతిక బిడ్లు తెరిచారు. కానీ! నెలరోజులుగా ఆర్థిక పరమైన బిడ్లు తెరవడం లేదు.

వ్యాసం రాసి.. బహుమతి గెలిచి



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నర్సంపేట, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి విద్యతోపాటు అన్ని అంశాల్లో ప్రావీణ్యం పెంపుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని నర్సంపేట జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో సారయ్య తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతర్జాలం, సామాజిక మాధ్యమాల ప్రభావంతో విద్యార్థులు తప్పుదారి పట్టకుండా వాటిపై అవగాహన పెంపొందించుకునేందుకు 'ఈనాడు' యాజమాన్యం ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో 9వ తరగతికి చెందిన బి. జశ్వంత్, ఎస్.శ్రీజ, పదో తరగతి విద్యార్థిని జె.చందన వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వారికి సారయ్య బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, పి.రవి, ఎల్.రమేశ్, డి.రమేశ్, ఎం.రమేశ్, ఎం.శైలజ, ఎస్.గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు సారయ్య, ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

99635 59929, 98484 09191, 99896 42307, 97053 46535 (10 AM TO 1 PM)

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: అమీనాబాద్‌లో మంచి నీటి పైపులైన్ లీకేజీని అరికట్టి తాగు నీరు అందించండి. - రాజేష్, గ్రామస్థుడు

● పైపులైన్ లీకేజీని పరిశీలించి మరమ్మతు చేయిస్తాం. - నీటు, పంచాయతీ కార్యదర్శి

చెట్ల తీగల తొలగింపు

స్పందనకు వందనం

నల్లబెల్లి, న్యూస్‌టుడే: బోల్లోనిపల్లి జాతీయ రహదారి పక్కన విద్యుత్తు తీగలకు చెట్ల తీగలు అల్లుకుపోవడంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతోంది. సంబంధిత సమస్య ఈ నెల 20న 'మేమున్నాం.. మీకుతోడుగా'లో ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ సిబ్బంది మంగళవారం తీగలపై అల్లుకున్న చెట్ల తీగలను తొలగించి సమస్య పరిష్కరించారు.

అవగాహనతో పాటు జాగ్రత్తలు ముఖ్యం



హిజ్రాలతో కలిసి ఆరోగ్య కార్డులను విడుదల చేస్తున్న డా.ప్రసాద్

కరీమాబాద్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్, హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండటంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డా.ప్రసాద్ పేర్కొన్నారు. కరీమాబాద్‌లోని శ్రీనగర్‌కాలనీలో నివాసముంటున్న 60 మంది హిజ్రాలకు మోర్గాన్ అవేరనెస్ సొసైటీ సంస్థ అధ్యక్షురాలు ఓరుగంటి లైలా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శిబిరంలో ఆయన పాల్గొని సూచనలు చేశారు. డీఎస్‌ఆర్‌సీ కౌన్సిలర్ డా.కీర్తి సతీష్‌కుమార్, ఐసీటీసీ డీఐఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్థిరత్వం సాధించడం అభినందనీయం

సంగెం, న్యూస్‌టుడే: మహిళలు స్వయం సంఘాల ద్వారా పొందిన రుణాలతో స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడం అభినందనీయమని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు పరిశీలన బృందం అధికారి సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. మంగళవారం ఆశాలపల్లి, నార్లవాయి, మొండ్రాయి గ్రామాల్లో అధికారుల బృందం పర్యటించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. బృందం సభ్యుడు జయప్రకాశ్, లైజన్ అధికారి సుధాకర్, ఎంపీడీవో రవీందర్, ఏపీఎం కిషన్, పీఆర్‌ఏఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో అధిక సాంద్రత పద్ధతే మేలు

గీసుకొండ, న్యూస్‌టుడే: అధిక సాంద్రత పద్ధతి ద్వారా పత్తి పంటను సాగు చేసినట్లైతే రైతులకు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు సౌమ్య, రాజు, నాగ్‌పుర్ శాస్త్రవేత్తలు శరవన్, హోంరాజు గీసుకొండ మండలంలోని ఎలుకుర్తి హవేలీ, అనంతారం గ్రామాలను మంగళవారం సందర్శించి అధిక సాంద్రత పత్తి చేలను పరిశీలించారు. అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడం ద్వారా గులాబీరంగు పురుగు ఉద్ధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. కాయ దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులను సూచించారు. కార్యక్రమంలో గీసుకొండ, ఖిలా వరంగల్ మండలాల వ్యవసాయశాఖ అధికారులు హరిప్రసాద్‌బాబు, రవీందర్‌రెడ్డి, ఏఈవో స్మిత తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పంట సందర్శన

మామునూరు,న్యూస్‌టుడే: ఖిలా వరంగల్‌కోటలోని కూరగాయల పంటను మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు క్షేత్ర సందర్శన చేశారు. బీరకాయ తోటను పెంచుతున్న కొత్త రమేష్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. కాయకుళ్లు తెగులు ఉద్ధృతిని గమనించి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. రసాయనిక పురుగు మందులు తక్కువగా వాడాలని, జీవ ఆధారిత పురుగుమందులను వినియోగించాలని తెలిపారు.

రైలు ఎక్కుతూ.. జారిపడి యువకుడి మృతి



వెంకటేశ్ (పాతచిత్రం)

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: రైలు ఎక్కుతూ.. ప్రమాదవశాత్తు జారిపడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన వరంగల్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం జరిగింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా పెద్దకల్వలకు చెందిన కల్వల వెంకటేశ్(33) వృత్తి పరమైన పనుల నిమిత్తం సోమవారం వరంగల్‌కు వచ్చారు. తిరిగి వరంగల్ నుంచి పెద్దపల్లి వెళ్లే క్రమంలో.. మంగళవారం తెల్లవారుజామున డోర్నకల్-కాజీపేట ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ప్రయత్నించారు. ప్రమాదవశాత్తు రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో జారిపడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడి వద్ద లభించిన వివరాల ఆధారంగా అతడి బంధువులకు సమాచారం అందించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని అతడి బావ భాస్కర్‌కు అప్పగించారు.

రూ.1.80 కోట్ల బాణసంచా పట్టివేత

హనుమకొండ కలెక్టరేట్, మట్టెవాడ, న్యూస్‌టుడే : నగరంలో అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా పెద్దఎత్తున పట్టుబడింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల మేరకు.. వరంగల్ బీట్‌బజార్‌లోని వజినేపల్లి రమేశ్ అండ్ బ్రదర్స్, శ్రీసాయి ఫైర్స్ అండ్ క్రాకర్స్ నిర్వాహకులు అనుమతి లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. మంగళవారం రాత్రి మట్టెవాడ, ఇంతెజార్‌గంజ్ ఠాణా పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. సుమారురూ.1.80 కోట్ల బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్, ఆర్ఎస్సై శరత్ కుమార్, సిబ్బందిని సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

గంజాయి స్వాధీనం

ఖానాపురం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం నుంచి వరంగల్ వైపు గంజాయితో వెళుతున్న ఇద్దరిని ఐనపల్లిలో పట్టుకున్నట్లు దుగ్గొండి సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి మంగళవారం తెలిపారు. దుమ్ము గూడెం మండలం మరాయిగూడేనికి చెందిన నాగేశ్వర్‌రావు, కృష్ణ ఛత్తీస్‌గఢ్ నుంచి ఎండు గంజాయి తెచ్చి నర్సంపేటలో, నెక్కొండ, వరంగల్, రైల్వేస్టేషన్లలో విక్రయించేందుకు మంగళవారం తరలిస్తున్నారు. ఖానాపురం ఎస్సై రఘుపతి, కానిస్టేబుళ్లు బుధరావుపేట వైపు వెళుతుండగా అనుమానం వచ్చి పరిశీలించగా వీరి సంచుల్లో ఎండుగంజాయి లభించింది. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సుమన్, రమేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

తల్వార్‌తో హోంగార్డు హల్‌చల్

మట్టెవాడ, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: నగరంలో మంగళవారం రాత్రి ఓ హోంగార్డు తల్వార్‌తో హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులతో పాటు దుకాణదారులు భయాందోళనలకు గురయ్యారు. ఇంతేజార్‌గంజ్ ఠాణా సీఐ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన సుకుమార్ ప్రస్తుతం కాశీబుగ్గలో ఉంటూ.. వరంగల్ సబ్ డివిజన్ పరిధి ఇంతేజార్‌గంజ్ ఠాణాలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం రాత్రి కాశీబుగ్గ నుంచి ఓసిటీకి వెళ్లే కూడలిలో మద్యంమత్తులో తల్వార్ తిప్పుతూ హల్‌చల్ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు హోంగార్డును ఠాణాకు తరలించి కేసు నమోదు చేశారు. పోలీసుశాఖలో విధులు నిర్వర్తిస్తూ.. ఇలా బాధ్యతారహితంగా వ్యవహరించడంపై స్థానికులతో పాటు పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐఎంఏ హాలు ఎదుట కొండచిలువ కలకలం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఐఎంఏ హాలు ఏటీఎం వద్ద సోమవారం అర్ధరాత్రి కొండచిలువ ప్రత్యక్షమైంది. ఏటీఎంకు వెళ్లినవారు దానిని చూసి ఆందోళనకు గురయ్యారు. బాటసారులు, స్థానిక టీ దుకాణం నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో భారీగా జనం పోగయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు మంగళవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. అయితే కొండచిలువ చనిపోయి ఉందని తెలిసింది. పక్కనే కొన్నేళ్లుగా ఉపయోగంలో లేని పీజీ హాస్టల్ నుంచి వచ్చి ఉంటుందని అనుమానిస్తున్నారు.

సంక్షిప్తంగా

టఫ్ ఉపాధ్యక్షుడిగా సతీష్‌యాదవ్

ఖానాపురం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టఫ్) జిల్లా ఉపాధ్యక్షుడిగా మంగళవారిపేటకు చెందిన సతీష్ యాదవ్‌ను నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనీకాంత్ మంగళవారం ప్రకటనలో తెలిపారు.

సహస్ర చండీయాగం



లలితా పారాయణంలో మహిళలు

రామన్నపేట, న్యూస్‌టుడే: పోతనరోడ్డు మణిదీప గార్డెన్‌లో శ్రీకాంత్ అడిగ, వంశీకృష్ణ పర్యవేక్షణలో మంగళవారం సహస్ర చండీయాగం నిర్వహించారు. పడిశాల సుజాత ఆధ్వర్యంలో మహిళలతో లలితా పారాయణంలో 500 మంది మహిళలు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి కృషి

గీసుకొండ, న్యూస్‌టుడే: మహిళల సంక్షేమానికి అందరూ కృషి చేయాలని గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ అన్నారు. గీసుకొండ మండలం కొనాయమాకులలోని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో 15 మంది మహిళలకు రూ.20 వేల చొప్పున రుణాలు అందజేశారు. ఇన్‌స్పెక్టర్ మహేందర్ వారికి చెక్కులు అందజేశారు.

ఉపాధ్యాయుల పాత బకాయిలు చెల్లించాలి

రాయపర్తి: ఉపాధ్యాయుల పాత బకాయిలు చెల్లించాలని టీపీయూఎస్ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని కాట్రపల్లి, కొలన్‌పల్లి పాఠశాలలో ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. సమస్యల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటరమణగౌడ్, రవికుమార్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో మద్యంతాగి వాహనాలు నడిపిన 16 మందికి మంగళవారం రెండో తరగతి న్యాయమూర్తి వీరస్వామి రూ.24,300 విధించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. చోదక అనుమతి లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఆరుగురికి రూ.7 వేల జరిమానా విధించారన్నారు.

నూతన పంచాయతీగా బాలుతండా

ఖానాపురం, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మారావుపేట పరిధిలో ఉన్న బాలుతండాను ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ రాజపత్రం విడుదల చేసింది. గిరిజనులతోపాటు ఇతరుల సామాజిక వర్గాల ప్రజలు ఇక్కడ ఉన్నారు. తండాలో 627 మంది జనాభా ఉండగా 8 వార్డులుగా విభజన చేసినట్లు ఎంపీడీవో భారతి, ఎంపీవో సునీల్ రాజ్ తెలిపారు. బాలుతండాలో కాకతీయుల నాటి శివాలయం ఉంది.

రాంపూర్ డంపింగ్‌యార్డులో దిద్దుబాటు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాంపూర్ డంపింగ్‌యార్డులో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. మంగళవారం ఈనాడులో 'నిండిపోయిన డంపింగ్‌యార్డు' శీర్షికన ప్రచురితమైన కథనానికి గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీ స్పందించారు. ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వెంటనే అంతర్గత రోడ్లపై పేరుకుపోయిన చెత్తను పక్కకు నెట్టివేయించారు.

బ్యాంకు మిత్రపై కేసు నమోదు

నర్సంపేట, న్యూస్‌టుడే: నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్‌లోని ఓ మహిళ బ్యాంకు ఖాతా నుంచి అక్రమంగా నగదు కాజేసిన బిజినెస్ కరస్పాండెంట్ కేంద్రం నిర్వాహకురాలు(బ్యాంకు మిత్ర)పడాల రజిత పై మంగళవారం నల్లబెల్లి పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. నల్లబెల్లి ఏఎస్సై లక్ష్మారెడ్డి తెలిపిన ప్రకారం.. గోనె ధనమ్మ బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును తెలుసుకునేందుకు అక్కడి బిజినెస్ కరస్పాండెంట్ కేంద్రం నిర్వాహకురాలు(బ్యాంకు మిత్ర) వద్దకు వెళ్లగా. .నిర్వాహకురాలు తన వేలి ముద్రను వేయించుకుని ఖాతా నుంచి మూడు విడతలుగా రూ.70వేలు తీసుకున్నట్లు ధనమ్మ నల్లబెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి నగదు విడిపించినట్లు తేలడంతో బ్యాంకు మిత్రపై కేసు నమోదు చేసినట్లు లక్ష్మారెడ్డి వివరించారు.

ఎంజీఎంలో బయోమెట్రిక్ యంత్రాల చోరీ

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో రెండు బయోమెట్రిక్ యంత్రాలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం హాజరుకోసం వచ్చిన సిబ్బంది రెండు యంత్రాలు లేకపోవడాన్ని గుర్తించారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. సోమవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో చోరీకి గురైనట్లు అనుమానిస్తున్నారు. స్థానికంగా సీసీ కెమెరాలున్నా.. యంత్రాలను కవర్ చేసేలా ఏర్పాటు చేయలేదు. ఒక అనుమానితుడిని గుర్తించి, సీసీ ఫుటేజీ చిత్రం విడుదల చేశారు. ఈ ఘటనపై మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డా.చిలుక మురళి తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వివరణ కోసం సంబంధిత ఏజెన్సీకి నోటీసులు జారీ చేసినట్లు సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

నకిలీ పోడు పట్టాల తయారీ ముఠా అరెస్టు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: నకిలీ పోడు పట్టా పాసుపుస్తకాలు తయారు చేసిన ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి పోడు పట్టా పాసుపుస్తకాలు తయారుచేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ఎఫ్ఆర్వో డోలి శంకర్ తెలిపిన వివరాలు ఇలా.. ఈ నకిలీ పోడు పాసుపుస్తకాల వ్యవహారంలో ఏడుగురు వ్యక్తులు సూత్రధారులుగా ఉన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముగ్దుంపురం గ్రామానికి చెందిన చాందావత్ భద్రు ములుగు మండలంలోని పలు మండలాల రైతుల నుంచి డబ్బులు తీసుకుని ఈ తతంగాన్ని నడిపించాడు. వరంగల్ నగరానికి చెందిన గణేష్ ప్రింటర్స్ యజమాని తాటిపాముల రాజు ఒక్కో పాసు పుస్తకానికి రూ.2 వేలు తీసుకుని నకిలీ పుస్తకాలు తయారు చేసేవాడు. ఆన్‌లైన్ సెంటర్ నడుపుతున్న నర్సంపేటకు చెందిన భూక్య వెంకన్న క్యూఆర్‌కోడ్ సృష్టించాడు. మహబూబాబాద్‌కు చెందిన బానోత్ హరినాయక్ హోలోగ్రామ్ తయారు చేశాడు. నర్సంపేటకు చెందిన ధారావత్ కిషన్ బ్యాంకు రుణాల కోసం అటవీశాఖ రేంజ్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రాన్ని రూపొందించాడు. వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామానికి చెందిన జాటోత్ రాజ్‌కుమార్ (ఎఫ్ఆర్సీ ఛైర్‌పర్సన్) అటవీ హక్కు పత్రం పాసు పుస్తకం నమూనా పంపించాడు. ములుగు మండలం కాసిందేవ్‌పేట గ్రామానికి చెందిన వాంకుడోత్ రవి ఏజెంటుగా వ్యవహరిస్తూ.. పాసుపుస్తకం కావాలన్న వారి దగ్గర డబ్బులు వసూలు చేసి వివరాలను భద్రుకి పంపించేవాడు. ఏడుగురు వ్యక్తులు ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నారని, బ్యాంకులో రుణం పొందడానికి నకిలీ పోడు పట్టాల పుస్తకాలు తయారు చేసినట్లు విచారణలో తేలిందని ఎఫ్ఆర్వో తెలిపారు. మిగతా వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కేసు నమోదు చేస్తామన్నారు.

వార్డు అధికారుల నియామకం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటున్న పలు డివిజన్లకు వార్డు అధికారులను నియమిస్తూ మంగళవారం రాత్రి గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా.అశ్విని తానాజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న 10 మంది వార్డు అధికారులు పరకాల పురపాలక సంస్థకు బదిలీ అయ్యారు. వార్డు అధికారులు లేకపోవడంతో పన్నుల వసూళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో జాప్యమవుతోంది.

పర్యవేక్షకుడి సస్పెన్షన్ ఎత్తివేత

రెండునెలల క్రితం ఫ్లెక్సీ ముద్రణ తప్పిదాలకు బాధ్యుడిని చేస్తూ పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షకుడు జీవన్‌రావును కమిషనర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. సీడీఎంఏ వీపీ.గౌతమ్ ఆదేశాలనుసారం తాజాగా జీవన్‌రావు సస్పెన్షన్ ఎత్తివేశారు.

రంగశాయిపేటలో దారి దోపిడీ

రంగశాయిపేట: ఆటో చోదకుడిపై దాడి చేసి దోపిడీకి పాల్పడిన ఘటన రంగశాయిపేటలో చోటుచేసుకుంది. మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం. . ఎనుమాముల సుందరయ్యనగర్‌కు చెందిన మామిడి రమేశ్ ఈ నెల 21న అర్ధరాత్రి ఆటో నడుపుతూ గవిచర్ల క్రాస్‌రోడ్ వైపు వెళుతున్నారు. ఈక్రమంలో ముగ్గురు వ్యక్తులు ఆటో ఆపి దాడి చేసి.. జేబులో ఉన్న రూ.15 వేల నగదు, చరవాణి లాక్కెళ్లారు. చికిత్స అనంతరం బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

నర్సంపేట గ్రామీణం: తల్లీకూతుళ్ల అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అరుణ్ కథనం ప్రకారం. . మాధన్నపేటకు చెందిన వివాహిత కూతురితో కలిసి ఈ నెల 2న ఇంటి నుంచి వెళ్లిపోయింది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య జరుగుతున్న గొడవల కారణంగా ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. వారి ఆచూకీ కోసం గాలించినా దొరకకపోవడంతో మంగళవారం ఆమె భర్త ఫిర్యాదు చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



అభినవ నేతాజీ

రంగశాయిపేట, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే 49వ జాతీయ స్థాయి యోగా పోటీలకు రంగశాయిపేటకు చెందిన అభినవ నేతాజీ ఎంపికైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి కమలాకర్ తెలిపారు. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 16-18 ఏళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో తృతీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

వృద్ధులమని చూడకుండా వెళ్లగొట్టాడు!



కొమురమ్మ

వృద్ధులమని కనికరం లేకుండా తనను, తన తల్లిని ఇంట్లో నుంచి వెళ్లగొట్టిన కుమారుడిపై చర్యలు తీసుకోవాలని ఓ వృద్ధురాలు మంగళవారం అదనపు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. పర్వతగిరి మండలం చింతనెక్కొండకు చెందిన కొమురమ్మ, తన భర్త పేరిట రిజిస్ట్రేషన్ అయిన ఇంట్లో కురువృద్ధురాలైన ఆమె తల్లితో కలిసి ఉంటున్నారు. ఈక్రమంలో చిన్న కుమారుడు మల్లికార్జున్ ఆ ఇంటిని అతడి భార్య పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని.. మా ఇద్దరిని ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడని కొమురమ్మ వాపోయారు.

– న్యూస్‌టుడే, వరంగల్ కలెక్టరేట్

అసత్య ఆరోపణలు సరికావు

పర్వతగిరి, న్యూస్‌టుడే: కల్లెడ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఎర్రబెల్లి రాంమోహన్‌రావుపై అసత్య ఆరోపణలు సరికావని పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామ కెనాల్ కాల్వను పూడ్చివేసి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చి అమ్ముకున్నట్లు ప్రజావాణిలో తప్పుడు ఫిర్యాదు చేయడంపై మండిపడ్డారు. గ్రామంలోని కాలనీలు మునిగినట్లు కొంత మంది ఆరోపణలు చేయడం వారి సొంత లాభం కోసమేనన్నారు. ఆరోపణలు చేస్తున్న వ్యక్తులు బుధవారం గ్రామంలోని అంబేడ్కర్ సెంటర్ వద్దకు చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో గ్రామస్థులు సమ్మయ్య, లచ్చయ్య, వెంకన్న, విజయ్, వెంకటయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలు

వర్ధన్నపేట: పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికురాలు కొమురమ్మను వరంగల్ నుంచి జఫర్‌గఢ్ వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించారు

నర్సంపేట నియోజకవర్గం


చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

నర్సంపేట, న్యూస్‌టుడే: ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని, విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నర్సంపేట సీఐ రమణమూర్తి అన్నారు. పోలీసు అమరుల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి నర్సంపేట బస్టాండ్ ఆవరణలో జాగృతి పోలీస్ కళాకారుల బృందం ప్రదర్శించిన కళాజాతను ప్రారంభించి మాట్లాడారు. ఎస్సై అరుణ్, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



కుమురం భీం జయంతి

నర్సంపేట గ్రామీణం, దుగ్గొండి, న్యూస్‌టుడే: మాదన్నపేటకు చెందిన ఆదివాసీ తోటి సేవా సంఘం ఆధ్వర్యంలో కుమురం భీం జయంతిని మంగళవారం నిర్వహించారు. స్థానిక భీం విగ్రహం వద్ద నివాళులర్పించారు. మహమ్మదాపురం ఉన్నత పాఠశాలలో కుమురం భీం చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు కాళిదాస్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న జిల్లా నార్కోటిక్స్ సీఐ రవీందర్

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువజనులు మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని జిల్లా నార్కోటిక్స్ సీఐలు రవీందర్, సురేశ్ తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర, మై భారత్ వరంగల్ స్థానిక అటానమస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై మంగళవారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. మాదకద్రవ్యాలు తీసుకుంటే జీవితంలో ఎలాంటి అనర్థాలు జరుగుతాయో వివరించారు. సైక్రియాటిస్టు డాక్టర్ భరత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ నవీన్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి అన్వేష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు అంజలి



దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా బాలికల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని అంజలి జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేకాధికారి మంజుల తెలిపారు. ఈ నెల 3 నుంచి 5 వరకు నారాయణపేట జిల్లా ధన్వాడలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో అండర్ 19, 55 కిలోల విభాగంలో అంజలి స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 23 నుంచి దిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొననున్న అంజలిని ప్రత్యేకాధికారి మంజుల, పీఈటీ లావణ్య అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు..

దుగ్గొండి: దుగ్గొండిలోని ఆదర్శవాణి ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ రవి తెలిపారు. ఈ నెల 20న జేఎన్ఎస్ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలలో రామ్‌చరణ్ 35 కిలోలు, సాయితేజ 48 కిలోలు, అజయ్ 62 కిలోలు, అక్షయ్ 68 కిలోలు, రుత్విక్ 65 కిలోల విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు.

మేలైన విత్తనాలు కొనుగోలు చేస్తే మేలు

ఖానాపురం: ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన వరి విత్తనాలనే కొనుగోలు చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరి జన్యు శాస్త్రవేత్త వెంకన్న, ఏరువాక కేంద్రం సమన్వయకర్త దిలీప్, ప్రధాన శాస్త్రవేత్త నాగభూషణం అన్నారు. ధర్మారావుపేటలో ప్రైవేటు విత్తనాలు జైశ్రీరాం, యశోద సీడ్స్‌ను సాగు చేసి నష్టపోయామని రైతులు విత్తన డీలర్లపై ఫిర్యాదు చేయడంతో మంగళవారం బాధితుల పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. రైతులు సాగు చేసిన ఈ విత్తనాల్లో కల్తీ సగానికి పైగానే ఉందని గుర్తించారు. వెంకన్న 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీల విత్తనాలను సాగు చేస్తే పరిస్థితులు ఇలాగే ఉంటాయన్నారు. నష్టపరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏడీఏ దమోదర్‌రెడ్డి, ఏవో శ్రీనివాస్, రైతులు రవి, భిక్షపతి, వెంకన్న, శ్రీను, మోహన్‌రావు, సంపత్, డీలర్లు రమేష్, యుగేందర్ ఉన్నారు.

తాగు నీటి సరఫరాకు ఇబ్బంది రానీయొద్దు

ఖానాపురం:పంచాయతీ, భగీరథ సిబ్బంది నాలుగు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకొని ప్రజలకు సకాలంలో తాగునీరు అందించాలని మిషన్ భగీరథ ఈఈ వెంకట్రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి ధ్రువపత్రాలు అందించారు. క్షేత్రస్థాయిలో బోరింగులు, బోరుబావులు, పైప్‌లైన్‌లు, గేటువాల్వులకు మరమ్మతులు చేసే విధానంపై మెకానిక్‌లతో చూపించారు. కార్యక్రమంలో ఏఈలు మౌనిక, శిరీష, మెకానిక్ రమేష్, సిబ్బంది మహేందర్, శ్రీను, హరీష, భిక్షపతి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు అందించండి

చెన్నారావుపేట: డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులను చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బాలాజీరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీయూఎస్ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా మంగళవారం ఉప్పరపల్లి పాఠశాలలో నిరసన చేపట్టారు. రమణయ్య పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల సందర్శన

నెక్కొండ, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ పాఠశాలను మంగళవారం మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి సందర్శించారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఎస్ఏ పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు, అధ్యాపక బృందానికి పలు సూచనలు చేశారు. ఏఎంవో మంజరి, ఏఎంవో రవికుమార్, ప్రిన్సిపల్ ప్రణయ్‌కుమార్ ఉన్నారు.

సంఘ అభివృద్ధికి కృషి చేయండి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు సంఘ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా సహకార అధికారిణి నీరజ అన్నారు. చెన్నారావుపేట ప్రాథమిక సహకార సంఘాన్ని మంగళవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం పాలకవర్గ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

IN THE COURT OF THE HON'BLE VIII ADDITIONAL DISTRICT JUDGE
RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
O.S.No. 915 OF 2024

BETWEEN:
B. CHANDRASHEKAR ...PLAINTIFF
AND
Smt. B. MANEMMA and others ..DEFENDANTS

To
21. Smt. A. PARVATHI, W/o. A. Shantham Rao, Aged about 59 Years, Occ: Housewife, R/o. LIG-1-420, Keerthi Nagar, Geesugonda Mandal, Gorrekunta Warangal District-506 013.

NOTICE

The Plaintiff herein had filed the Suit for Partition, Separate Possession and Declaration against the Defendants. The Hon'ble Court had ordered for publication of this Notice for appearance of Defendant No.21 and the matter is posted to 20.11.2024. Therefore, you may appear before the Hon'ble VIII Additional District Judge, Ranga Reddy District at L.B.Nagar on 20.11.2024 at 10:30 A.M. either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of Law.

Hence, this Notice.

(BY ORDER OF THE COURT)
For
M/s RESU LAW OFFICE
Advocates.
8-2-293/82/158/A, MLA's Colony, Road No.12, Banjara Hills, Hyderabad - 500034.
Tel: 040-23558778/ 23568778